# కథ

కైరవి బెడ్ మీద జారగిల పడుకుని వళ్లో లాప్‌టాప్ పెట్టుకుని ఇ-మెయిల్ చెక్ చేసుకుంటోంది.

‘‘హలో పిన్నిగారూ!!’’

ఒక్క క్షణం వులిక్కిపడింది. ‘‘ఏమిటి నన్నేనా?’’

‘ఇది నా మెయిలేనా’ అన్న అనుమానం వచ్చింది కైరవికి. నన్ను పిన్ని అని సంబోధించే వారెవరు? అటు నాలుగు తరాలు ఇటు నాలుగు తరాలు వెదకి చూసినా తనే చిన్నది. అందుకే అందరూ తనను గారాబం చేస్తుంటారు.



# పిన్నిగారికి బుజ్జిగాడి ఇ-మెయిల్

ఎల్. సుకన్య

కైరవి మళ్లీ మరోసారి పరికించి చూసింది. పి.ఐ.ఎన్.ఎస్.ఐ- కరక్టే పిన్నీ. 'ఎవరబ్బా' క్రిందకు స్క్రోల్ చేసింది. 'ప్రేమతో నీ బుజ్జిగాడు' అని వుంది. 'ఈ బుజ్జిగాడు ఎవడ్రా బాబు' అనుకుంటూ తనలో తానే నవ్వుకుని మెయిల్ చదవడంలో మునిగిపోయింది.

బావున్నావా పిన్నీ?

పిన్నీ కైరవీ, నా మనసులోని మాట నీకు చెబుదామని ఈ మెయిల్ వ్రాస్తున్నా. ప్రస్తుతం నువ్వు తప్ప నా మాట వినేవారు మరెవ్వరూ లేరు.

అమ్మమ్మను పలుకరిద్దామంటే ఆమెగారు ఐదేళ్లనుండి కంప్యూటర్ నేర్చుకుంటున్నా, ఆన్ చేయడం నేర్చుకుంటే ఆఫ్ చేయడం మర్చిపోతుంది. క్లోజ్ చేయడం గుర్తు పెట్టుకుంటే కంప్యూటర్ ఆన్ చేయడంతో తికమక. పోనీ తాతయ్యగార్ని కదలిద్దామంటే జీడిపప్పు బిజినెస్‌లో వాటి నాణ్యత, రకాల పరిశీలనలో నిత్యం బిజీ. ఆయనగారి లెక్కలన్నీ గుమస్తాలు కంప్యూటర్‌లో ఫీడ్ చేస్తారుగదా! అందుకే తాతయ్య కంప్యూటర్ జోలికి పోనేపోరు.

ఇక నాయనమ్మ సంగతి చూద్దామంటే, ఆమెగార్కి టివి తప్ప మరో ప్రపంచం తెలియదు. ప్రభంజనంలా విడుదలయ్యే కొత్త సినిమాల వివరాలు తెల్సుకోడంలో జిజ్ఞాస ఎక్కువ. ఈ తాతయ్యకి కంప్యూటర్ తెల్సుగానీ పేద్ద డాక్టరుగదా. ఎప్పుడూ ఆపరేషన్లు, పేషంట్లతో హడావుడి, హంగామా.

వీళ్లందరూ కాదు అమ్మ నాన్నతో కాసేపు మాట్లాడదామంటే వాళ్లు ఉదయం లేచినప్పట్నుండీ పడుకునే వరకు చెప్పలేనంత బిజీ. నేనేమో ఈ చిన్ని ప్రపంచంలో హాయిగా, వెచ్చగా విశ్రాంతిగా వున్నాను. కానీ నన్ను పట్టించుకునే తీరికేది? అమ్మ తన ఆరోగ్యం గురించి సెకండ్ ఒపీనియన్ తీసుకోవాలని ఇద్దరు డాక్టర్లను సంప్రదించింది. ఇద్దరు డాక్టర్లు విశ్రాంతి చాలా అవసరమని, మరికొంచెం ఆహారం పెంచాలని చెప్పారు. కానీ అవన్నీ పాటించడానికి అమ్మకు తీరికేది? ప్రొద్దస్తమానం 'కెరియర్, కెరియర్' అంటూ ఆపసోపాలు పడుతూవుంటుంది. ఈ విషయంలో నాన్న అమ్మకు పోటీ.


**ఒక్కోసారి నాకు బాగా కోపం వస్తూవుంటుంది పిన్నీ. ఒక్క తన్ను తంతాను. అంతే. భూగోళం పగిలినట్లు వులిక్కిపడుతుంది. అంతలోనే నవ్వుకుంటుంది. అంతే గాని నా బాధను మాత్రం అర్థం చేసుకోదు. నా బుజ్జి తండ్రికి ఎంత ఆకలేస్తోందోనని ఒక పండో, ఫలమో తినొచ్చు గదా!**


నాన్న రొటీన్‌గా అమ్మను అడుగుతూ వుంటారు. ''పాలు తాగావా?'' ఐరన్ టాబ్లెట్ వేసుకున్నావా?'' అని.

అమ్మ అంతకంటే రొటీన్‌గా తాగమంటుంది. నిజానికి అమ్మ అసలు పాలు తాగదు పిన్నీ. లావవుతుందట. నీకు తెల్సా, జ్యూస్‌లు కూడా తాగదు. వళ్ల జ్యూస్‌ల్లో షుగర్ చాలా ఎక్కువట. ఒళ్లు వెంటనే వస్తుందట. పోనీ పళ్లు తింటుందా అంటే అవీ తినదు. పళ్లలో ఫైబర్స్ వున్నాయని, వంటికి చాలా మంచిదని వొప్పుకుంటుంది. కానీ అవి కోసుకుని తినేంత తీరికేది? బ్యాగ్‌లో పెట్టుకున్న పళ్లు బ్యాగ్‌లో కుళ్లిపోతూవుంటాయి. ఇక్కడ నా పొట్ట నకనకలాడుతూ వుంటుంది. అమ్మ అస్సలు పట్టించుకోదు పిన్నీ. ఒక్కోసారి ఏడ్పుకూడా వస్తుంది. కాస్త విశ్రాంతిగా, నెమ్మదిగా ఇష్టంగా అన్నం తినొచ్చుగదా! ఉcహూc- ఎప్పుడూ హడావుడే. ఆ హడావుడి తిండితో నాకిక్కడ వూపిరాడదు.

ఒక్కోసారి నాకు బాగా కోపం వస్తూవుంటుంది పిన్నీ. ఒక్క తన్ను తంతాను. అంతే. భూగోళం పగిలినట్లు వులిక్కిపడుతుంది. అంతలోనే నవ్వుకుంటుంది. అంతేగాని నా బాధను మాత్రం అర్థం చేసుకోదు. నా బుజ్జి తండ్రికి ఎంత ఆకలేస్తోందోనని ఒక పండో, ఫలమో తినొచ్చు గదా!

ఈ రోజు మధ్యాహ్నం ఏమైయిందో తెల్సా పిన్నీ. లంచ్‌టైం దాటుతోంది. అయినా టిఫిన్ బాక్స్ ముందు పెట్టుకుని తన కొలిగ్‌తో ప్రాజెక్ట్ గురించి డిస్కస్ చేస్తోంది. మధ్య మధ్యలో వాళ్ల గురించి, వీళ్ల గురించి గుసగుసలు. నాకేమో ఇక్కడ ఆకలి. అస్సలు పట్టించుకోవడంలేదు. ఒళ్లు మండింది. దాంతో ఎడమవైపు డొక్కలో






గట్టిగా ఒక్కటిచ్చా. అంతే అమ్మ వులిక్కిపడింది. అంతలోనే సర్దుకుని నవ్వుతూ తన కొలిగ్‌కు చెప్పింది. ''మా అబ్బాయి నన్ను తంతున్నాడు–''

''ఈ పిల్లలంతే. పుట్టకముందే తన్నడం మొదలుపెడతారు. ఆ తర్వాత జీవితాంతం మనకు మొట్టికాయలే. కనడం ఒక గంట, రెండు గంటల్లో అయిపోతుంది. ఆ బాధ కూడా వద్దనుకుని డాక్టరుకి చెబితే ఒక్క గాటుతో చిటికెలో పూర్తి చేస్తారు. పెంచడం మాత్రం అదొక మహా యజ్ఞం. అన్నీ అగచాట్లే. ఆ క్రష్‌లో వుంచి, ఈ క్రష్‌లో వుంచి, అయిన వాళ్లని కాని వాళ్లని, పని వాళ్లని, పని మనుషుల్ని బ్రతిమిలాడుకుని, బామాలుకుని– హుష్ చెప్పొద్దు. ఎన్ని అగచాట్లో?''

''మా అబ్బాయి బంగారు తండ్రి''

''బంగారు తండ్రి అవునో కాదో ముందు ముందు తెలుస్తుందిలే''

'ఆ కొలిగ్ గార్కి నా గురించి ఏం తెల్సు? అలా అనొచ్చా! తప్పుకదూ? నువ్వే చెప్పు పిన్నీ'

అమ్మ నిద్రపోయేముందు, అదీ అలసట లేకపోతే, మా నాన్నతో పేచీ లేకపోతే వాళ్లిద్దరూ ముద్దుముద్దుగా నా గురించి కబుర్లు చెప్పుకుంటారు. అప్పుడప్పుడూ నిద్ర రాకపోతే ప్రక్కకు వత్తిగిలి పడుకుని నాతో వూగులాడుతుంది. అప్పుడు నాకు ఎంత సంతోషంగా వుంటుందో చెప్పలేను. మా అమ్మ ముఖంలోకి ముఖం పెట్టి చూస్తూ ప్రశాంతంగా, ప్రతి అక్షరం శ్రద్ధగా వింటాను.

పిన్నీ, నా కసలు ఎంచక్కా ఇక్కడే ఈ చిన్ని పట్టు పరుపుమీద హాయిగా, వెచ్చగా వుండాలన్పిస్తోంది. అమ్మ పెట్టింది తిని ఇక్కడే ఇలాగే అటు ఇటు తిరుగుతూ ఆడుకోవచ్చు. కానీ ఈ మధ్య ప్లేస్ సరిపోవడంలేదు. ఇంక కొద్దిరోజుల్లో మీ ప్రపంచంలోకి వచ్చేస్తానట.

మీ ప్రపంచం చాలా విశాలమైందటగదా! దేవుడు ప్రకృతిని చాలా అందంగా సృష్టించాడట గదా! హాయిగా బ్రతకమని గాలి, నీరు పుష్కలంగా ఇచ్చాడటగా కానీ మీరు అందమైన ప్రకృతిని అత్యాశతో వికృతంగా మలుస్తున్నారటగా. అంతేకాదు ప్రేమలు, ఆత్మీయతలు పల్చబడుతున్నాయిటగా రోజురోజుకి. అవసరాలు తీర్చుకునే బంధుత్వాలు, మిత్రత్వాలు ఎక్కువట. ఏమో పిన్నీ నాకు భయంగా వుంది. నాకు దోపిడీలు, దౌర్జన్యాలు చేతకావు. దేవుడిచ్చిన కల్మషంలేని మనసుతో. మీ ఆప్యాయతను కోరుకుంటూ, నన్ను నేను నమ్ముకుంటూ, ఆత్మవిశ్వాసంతో పాజిటివ్ థింకింగ్ అనే ఆయుధంతో మీ ప్రపంచంలోకి అడుగుపెడతాను. నా సున్నితమైన మనసుకు అంతకంటే తెలియదు మరి.

అమ్మకు నా అభ్యర్థనగా ఒకమాట చెప్పవూ? తనవునికిని తాను మర్చిపోయి కంగారుగా వేగంగా కాలంతోపాటు పరుగులు పెట్టవద్దని చెప్పవూ? ఆవేశం, ఆరాటం తగ్గించుకుని, స్థిమితంగా ఆలోచిస్తూ నింపాదిగా ముందుకు అడుగులు వెయ్యమని నాన్నకి చెబుతావా?

పిన్నీ, ఇంతకీ నీ టైం చాలా వృథా చేస్తున్నట్టున్నాను ఏమనుకోకు. ఎలాగూ నువ్వు కాలేజి బంక్ కొట్టి, షికార్లకి, సినిమాలకి తిరుగుతూ టైం గడిపేస్తుంటావు గదా! ఇంట్లో వున్నంతసేపూ లాప్‌టాప్ ముందు పెట్టుకుని, ఒకవైపు సినిమా, మరోవైపు ఇ-మెయిల్, ఇంకోవైపు చాట్ చేస్తూ, ఒక చెవిలో సెల్‌ఫోన్, మరోచెవిలో ఐపాడ్‌తో నీ రూంలో అరెస్టయిపోయి హేపీగా గడిపేస్తుంటావు గదూ!

నువ్వు చాలా మంచిదానివి పిన్నీ. మా కైరవి చాలా అమాయకురాలు. పేరుకు తగ్గట్లే వెన్నెల వంటిదని మా అమ్మ మా నాన్నతో చెబుతూంటే విన్నాను. అందుకే అడుగుతున్నా– అమ్మ ఎలాగూ అమ్మమ్మ మీద నన్ను వదిలేస్తుంది. నాకు గోరుముద్దలు తిన్పించేది అమ్మమ్మే అనుకో. కానీ అమ్మమ్మ సంగతి నీకు తెల్సుగా. పొరుగింటావిడతో ముచ్చట్లు పెట్టిందంటే నా పని గోవిందా. అటువంటప్పుడు నాకు గోరుముద్దలు మెత్తగా కలిపి తినిపించవా? నీకు ఇష్టమైన పిజ్జాలు, బర్గర్లు నాకు పెట్టవా.

మరేమీ అనుకోకపోతే మరొక మాట పిన్నీ. నాకు మటన్, గోంగూర తినాలని వుంది. అమ్మకీ విషయం ఎప్పుడో చెప్పాను. కానీ పట్టించుకోవడంలేదు. అమ్మకు తీసుకువచ్చి తినిపించవా? ప్లీజ్....

నీకు ఇంకా చాలా చాలా చెప్పాలని వుంది పిన్నీ. కానీ టైపు చేసి చేసి నా చిన్ని చేతులు నొప్పిపెడుతున్నాయి. చూడు ఎలా ఎర్రగా కందిపోయాయో!

నేను వచ్చాక బోలెడన్ని కబుర్లు చెప్పుకుందాం. టా... టా... బై.

ప్రేమతో

నీ బుజ్జిగాడు

కైరవీ, ఓసి మొద్దు మొహమా, లాప్‌టాప్, సెల్‌ఫోన్ ఆన్లో వుంచి, లాప్‌టాప్‌మీదపడి నిద్రపోతున్నావా? త్వరగాలేవే. లేచి తలుపేసుకో.

అక్క ఇప్పుడే హాస్పిటల్ నుండి ఫోన్ చేసింది. ఆఫీసులో నొప్పులు మొదలయ్యాయట. హాస్పిటల్‌కి అటునుంచి అటే వెళ్లిపోయింది. సాయంత్రం లోపల డెలివరీ కావొచ్చట.

ఎక్కడికీ వెళ్లకు. ఇంట్లోనే వుండు. ఏమైనా కావల్సివస్తాయేమో. నీకే చెబుతోంది. త్వరగా లే'' శారద కంగారుగా గట్టిగా అరుస్తుంటే నిద్రలేచింది కైరవి.